
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 25 జూన్ 2024



జన్మభూమికి గ్రీన్‌సిగ్నల్
సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా.. » నేటి నుంచే పునఃప్రారంభం
రైళ్లు రద్దుపై విమర్శలు
వెల్లువెత్తడంతో ఒక అడుగు వెనక్కి తగ్గిన అధికారులు
సింహాద్రి, రత్నాచల్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు ఇంకా దక్కని ఊరట
7



పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి వద్ద విక్రయానికి సిద్ధం చేసిన పైనాపిల్

మన్యంలో జోరుగా పైనాపిల్ విక్రయాలు

» ఒక్కొక్కటి రూ.25 చొప్పున అమ్మకం
» ఏజెన్సీ వ్యాప్తంగా 500 ఎకరాల్లో పంట
» రైతుల అనుభవాలే పాఠాలుగా పైనాపిల్ తోటల పెంపకం
» మార్కెటింగ్ సౌకర్యం కల్పించని ప్రభుత్వం
» ప్రోసెసింగ్ యూనిట్లు హామీలకే పరిమితం
» వీటిని కల్పిస్తే స్థిరంగా ధరలు ఉంటాయంటున్న పైనాపిల్ రైతులు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీలో ప్రస్తుతం పైనాపిల్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడ చూసినా పైనాపిల్ గుట్టలుగా పోసిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. ఈ సీజన్‌లో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి మండలాల్లో వాటి క్రయ విక్రయాలు జోరందుకుంటున్నాయి. ఏజెన్సీ వ్యాప్తంగా 500 ఎకరాల్లో పైనాపిల్ తోటల పెంపకాన్ని గిరిజన రైతులు చేపడుతున్నారనేది ఒక అంచనా. పాడేరు మండలం వంట్లమామిడి, సలుగు, దేవాపురం, ఐనాడ పంచాయతీల పరిధిలో పదుల సంఖ్యలోని గిరిజన రైతులు వాటి



ఏజెన్సీలో పండించే పైనాపిల్

పెంపకం చేపడుతున్నారు. వాటిని స్థానికంగా గ్రామాల్లో, వారపు సంతల్లో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. అలాగే మైదాన ప్రాంతానికి చెందిన వర్తకులు సైతం ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసుకుని, చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం, నర్సీపట్నం, తుని ప్రాంతాల్లోని మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం హోల్‌సేల్ ధర రూ.15, రిటైల్ ధర రూ.25 చొప్పున పైనాపిల్ విక్రయాలు జరుగుతున్నాయి. అలాగే ఏజెన్సీలో సేంద్రీయ పద్ధతిలో వాటి పెంపకం చేపడుతుండడంతో ఇతర ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది.

పైనాపిల్ రైతులకు ప్రోత్సాహమేదీ..?

ఏజెన్సీలో వందల ఎకరాల్లో ... మిగతా 8వ పేజీలో



కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకారం రేపు

పాడేరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించిన ఏఎస్.దినేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఆయన బుధవారం ఇక్కడికి వచ్చి ప్రస్తుత జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న విజయసునీతకు ఆదేరోజు కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు పలికేందుకు అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళా కలెక్టర్‌గా ఆమె తక్కువ సమయంలోనే జిల్లాపై పట్టు సాధించి, అందరి మన్ననలు పొందారు. అలాగే కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దినేశ్‌కుమార్ గతంలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేయడంతోపాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితులకు సంబంధించిన అంశాలపై సంపూర్ణ అవగాహన ఉంది. ఆయనకు గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి చక్కని సేవలు అందిస్తారని జిల్లా వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జూలై 20న సింహ గిరి ప్రదక్షిణ 7



ప్రభుత్వం మారడంతో కొమ్మంగి తారు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్

కొమ్మంగి రహదారికి మోక్షం

» కూటమి ప్రభుత్వం రాకతో పనులు పునఃప్రారంభం
» చంద్రబాబు నిధులు విడుదల చేస్తారనే నమ్మకంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్
» నెలాఖరుకు పూర్తి కానున్న తారురోడ్డు

చింతపల్లి, జూన్ 24:

మండలంలో గత ఐదేళ్లుగా అసంపూర్తి నిర్మాణాలతో నిలిచిపోయిన కొమ్మంగి రహదారికి మోక్షం కలిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారి నిర్మాణం ప్రారంభమైంది. రహదారి నిర్మాణాలకు నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేస్తారనే నమ్మకంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. నెలాఖరు నాటికి తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ డీఈఈ చాణిక్యరావు తెలిపారు. మావోయిస్టు పార్టీ ఎస్‌జెడ్‌సీ కంపెనీ మొదటి కమాండర్ కుడుముల రవి అలియాస్ వెంకటరావు స్వగ్రామం కొమ్మంగి. రవి మావోయిస్టు పార్టీలో పనిచేసిన కాలంలో పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారులు తరచూ కొమ్మంగి గ్రామాన్ని సందర్శించేవారు. రవి మరణంతో కొమ్మంగి గ్రామం వైపు అధికారులు కన్నెత్తి చూడలేదు. అయితే 2017-18 సంవత్సరంలో కొమ్మంగి రహదారికి తెలుగుదేశం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 4.3 కిలోమీటర్ల రహదారి నిర్మాణం కోసం రూ.2.5 కోట్ల నాబార్డు నిధులను విడుదల చేసింది. 2019లో జనవరిలో కొమ్మంగి రహదారి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అయితే అదే



ఘాట్ రోడ్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

ఏడాది వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రహదారి నిర్మాణాలకు బ్రేక్ పడింది.

నిధులు విడుదల చేయని వైసీపీ ప్రభుత్వం

కొమ్మంగి రహదారి నిర్మాణాలకు సంబంధించి గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా విడుదల చేయలేదు. దీంతో రహదారి నిర్మాణాలు నిలిచిపోయాయి. 2019 నుంచి 2021 వరకు కాంట్రాక్టర్ 30 శాతం రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికి వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో పనులను కాంట్రాక్టర్ అర్ధంతరంగా నిలిపివేశాడు. నిధులు విడుదల చేయాలని పలుమార్లు ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి బిల్లులు పంపించినప్పటికీ ఒక్క పైసా ... మిగతా 8వ పేజీలో



స్తబ్ధుగా డీసీసీబీ

ఈ నెల మొదటి వారంలో పాలకవర్గం రద్దు
పర్సన్ ఇన్‌చార్జి లేకపోవడంతో కుంటుపడిన పాలన
సహకార సంఘాలదీ అదే పరిస్థితి
రుణాలు మంజూరుపై ప్రభావం

విశాఖపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గం రద్దయింది. దీంతో ప్రస్తుతం సారథి లేక పాలన స్తంభించింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారంతా రాజీనామా చేయాలని ఈ నెల మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఈ మేరకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్ పదవికి కోలా గురువులు రాజీనామా చేయడంతో పాలకవర్గం రద్దయింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించి తొలుత మంత్రివర్గం ప్రమాణం, తాజాగా ఎమ్మెల్యేలు పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీంతో డీసీసీబీ బాధ్యతలు జిల్లా అధికారులకు అప్పగించడంలో జాప్యం జరిగింది.

గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు కార్యకలాపాలు, వ్యాపార లావాదేవీలపై నిర్వహించే ఆడిట్ నివేదికను జూన్ చివరి వారంలో బ్యాంకు పాలకవర్గం ఆమోదించాలి. తరువాత నెలాఖరులోగా రిజర్వు బ్యాంకుకు పంపాల్సి ఉంటుంది. ప్రస్తుతం డీసీసీబీకి పాలకవర్గం/పర్సన్ ఇన్‌చార్జి లేకపోవడంతో ఆడిట్ రిపోర్టును ఎవరు ఆమోదిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ నెలాఖరులోగా ఆడిట్ రిపోర్టు ఆర్‌బీఐకు పంపకపోతే పలు రకాల ఇబ్బందులు ఎదురవుతాయనే ఆందోళన నెలకొంది. ఇదిలావుండగా డీసీసీబీలతోపాటు ప్రాథమిక సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు కూడా రద్దయ్యాయి. దీంతో జిల్లాలోని 98 ప్రాథమిక సహకార సంఘాల్లో రుణాల మంజూరు నిలిచిపోయింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రుణాల అవసరం ఉంటుంది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో తీసుకున్న రుణాలు జూన్‌లో చెల్లించి, రెండు, మూడు రోజుల తరువాత తిరిగి కొత్త రుణం కోసం సంఘానికి వస్తారు. ప్రస్తుతం పలు సంఘాల పరిధిలో గత ఏడాది తీసుకున్న రుణాలు చెల్లించిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వాలంటే సంఘం పాలకవర్గం ఆమోదం తప్పనిసరి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పాలకవర్గాలు లేకపోవడంతో రుణాల మంజూరు నిలిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని డీసీసీబీ/ప్రాథమిక సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జులు లేదా పాలక వర్గాలను నియమించాలని రైతులు కోరుతున్నారు.

చింతపల్లి, జీకే వీధిల్లో కుండపోత

» మూడు గంటల పాటు భారీ వర్షం
» వాగులను తలపించిన రోడ్లు
» ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు
» అరకులోయలో మోస్తరు వర్షం
» వ్యవసాయ పనులకు ఎంతో మేలు

గూడెంకొత్తవీధి/చింతపల్లి/అరకులోయ, జూన్ 24:

అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతపల్లి, జీకేవీధి, అరకులోయ మండలాల్లో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. వర్షంతో రహదారులు వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు, చెరువుల్లో వర్షపు నీరు చేరింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అరకులోయలో సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అరగంట సేపు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం మబ్బుగా ఉంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. భారీ వర్షంతో దుక్కులు చేసుకుని నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధం కావాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



చౌడుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ



చింతపల్లిలో కురుస్తున్న వర్షం

గోదావరినీ వదలని షెకావత్

ఆయన జమానాలో నిర్వాసిత మత్స్యకారుల హక్కులను అమ్మేసిన అటవీ అధికారులు
లంకలను అడ్డా చేసుకుని గోదావరి రెండు ఒడ్డుల మధ్య మత్స్య సంపద దోపిడీ
లైసెన్సులు ఉన్న నిర్వాసితులను అణచివేసి అంతరాష్ట్ర వేటగాళ్లకు ప్రోత్సాహం

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం)

రంపచోడవరం అటవీ డివిజన్‌లో షెకావత్ అవతారమెత్తిన అటవీ అధికారి తన బృందం అక్రమాలకు అటవీ సంపదనే కాకుండా పాపికొండల అభయారణ్యంలోని గోదావరి పరీవాహక ప్రాంతాన్నీ వదలలేదు. కాదేదీ అక్రమాలకు అనర్హం అన్న చందంగా గోదావరి పరీవాహక ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే గ్రామాలు ఖాళీ కావడంతో అక్కడ అక్రమాలకు తెరతీశారు. గోదావరిలో మత్స్య సంపద వేట హక్కులను కలిగిన నిర్వాసిత గిరిజనులపై ఆంక్షలు విధించి అంతరాష్ట్ర మత్స్య వేటగాళ్లకు గోదావరిపై గిరిజనులకు ఉన్న హక్కులను అమ్మేశారు. వివరాల్లోకి వెళితే...


పోలవరం నిర్మాణంతో ముంపునకు గురయ్యే గ్రామాల గిరిజన నిర్వాసితులకు చట్ట ప్రకారం పునరావాస చర్యలలో భాగంగా గోదావరిలో చేపల వేట హక్కులను మంజూరు చేశారు. లైసెన్సులను కూడా అందించారు. నిర్వాసిత గిరిజనులు సంప్రదాయబద్ధంగా మత్స్య సంపద మనుగడ దెబ్బ తినకుండా వేట సాగించేవారు. క్రమం తప్పకుండా చేప పిల్లలను గోదావరిలో వదిలేవారు. ఈ చర్యలతో గోదావరిలో మత్స్య సంపద పెరగడంతో దళారీల కన్ను పడింది. దీంతో కొంతమంది దళారులు మైదాన ప్రాంతాల నుంచి మత్స్యకారులను రహస్యంగా గోదావరి అవతల ఒడ్డు నుంచి, కాఫర్ డ్యామ్ ద్వారా రప్పించి రహస్య వేట సాగించడం మొదలుపెట్టారు.





పడవలో వేటాడిన చేపలు.. పక్కన మత్స్యకారులతో గిరిజన మత్స్యకారుల వాగ్వాదం (ఫైల్ ఫొటో)

రానురాను ఇది గోదావరిలో మత్స్య సంపద దోపిడీ ముఠాగా మారింది. ఇది క్రమేణా గిరిజన నిర్వాసిత మత్స్యకారుల మనుగడను, గోదావరిలో మత్స్య సంపద మనుగడను దెబ్బ తీసేలా పరిణమించింది. చేప పెరగకుండానే పిల్లలుగా ఉన్నప్పుడే వేటాడేస్తున్నారు. గోదావరిలో సాగుతున్న అంతరాష్ట్ర మత్స్యకారుల దోపిడీ వేటను నిరోధించాలని గిరిజన నిర్వాసితులు అటవీ అధికారులకు, పోలీసు అధికారులకు, ఐటీడీఏకు ఎన్ని ఫిర్యాదులు చేసినా, ఎన్ని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వ అండదండల కారణంగా ఎటువంటి చర్యలూ లేవు. మొక్కుబడిగా కొన్ని పడవలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయంలో ఉంచుకుని ఊరుకున్నారు. అంతేకాక ఈ దోపిడీని నిరోధించాల్సిన అటవీ శాఖ ఉన్నతాధికారులే దీనిని ప్రోత్సహించడం, ఈ దోపిడీని ఎదురించే గిరిజన మత్స్యకారులను ఇబ్బందులు పెట్టడం, పాపికొండల అభయారణ్యం పేరుతో గిరిజనులపైనే అటవీ చట్టాలను ప్రయోగించడం తదితర చర్యలతో గిరిజనుల అడ్డు లేకుండా చేసి తద్వారా పరోక్షంగా అక్రమ దందాకు వంత పాడుతున్నారు. అటవీశాఖాధికారులు, ఇతర సంబంధిత అధికారులు ఈ దోపిడీ వెనుక ఉన్న దళారీల ... మిగతా 8వ పేజీలో



డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల చేసిన జెన్‌కో అధికారులు

గోదావరి డెల్టాకు 2 వేల క్యూసెక్కులు విడుదల

ఏపీ జెన్‌కో ఎస్‌ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్

సీలేరు, జూన్ 24: ఖరీఫ్ పంటలు, తాగు నీటి అవసరాల కోసం గోదావరి డెల్టాకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏపీ జెన్‌కో ఎస్‌ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి జెన్‌కో అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారుల అభ్యర్థన మేరకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు.

అలాగే పవర్ కెనాల్ ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. ఈ మేరకు గోదావరి డెల్టాకు ఆరు వేల క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 12.5 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

క్రైం... crime news

లాడ్జిలో వివాహిత ఆత్మహత్య

- ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- చనిపోవాలని ప్రియురాలిని ప్రేరేపించిన ప్రియుడు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



చింతకాయల భాగ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)

నర్సీపట్నం, జూన్ 24 : వివాహేతర సంబంధం వివాహిత ఆత్మహత్యకు కారణమైంది. ప్రియుడే ఆత్మహత్య చేసుకొని చనిపోవాలని ప్రియురాలిని ప్రేరేపించిన ఘటన నర్సీపట్నంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ సుధాకరరావు, బంధువులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన చింతకాయల రమణ భార్య భాగ్యలక్ష్మి(39) బ్రాండిక్స్ కంపెనీలో పని చేస్తున్నది. నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లికి చెందిన ఆకుల అజయ్‌కుమార్ అదే కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ భాగ్యలక్ష్మితో పరిచయం పెంచుకొని వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలం ఉద్యోగం చేసి అజయ్ మానేశాడు. అయినప్పటికి ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నది. ఈనెల 6 నర్సీపట్నంలోని ఒక ప్రైవేటు లాడ్జిలో ఇరువురు రూమ్ తీసుకున్నారు. రెండు, మూడు రోజులు ఉన్న తర్వాత ఖాళీ చేసి వెళ్లిపోయేవారు. అదేవిధంగా ఈనెల 17వ తేదీ నుంచి అదే లాడ్జిలో రూమ్ తీసుకొని ఇద్దరూ ఉండిపోయారు. ఆదివారం సాయంత్రం భాగ్యలక్ష్మి లాడ్జిలో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. హుటాహుటిన ఆమెను ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లినప్పటికి అప్పటికే ఆమె మృతి చెందినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. డబ్బు, బంగారం తీసుకురమ్మని భాగ్యలక్ష్మిని అడిగానని, తీసుకురాక పోతే ఆమెని చనిపొమ్మని తానే ప్రేరేపించానని అజయ్ పోలీసులకు ఇచ్చిన వాగ్మూలంలో అంగీకరించాడని ఎస్‌ఐ సుధాకరరావు తెలిపారు. తన భార్య డబ్బు, బంగారం తీసుకుపోయి అజయ్‌కి ఇచ్చేసేదని మృతురాలి భర్త రమణ చెప్పాడు. నెల రోజులుగా సరిగ్గా ఇంటికి కూడా రాలేదని తెలిపారు. ఇదిలా ఉండగా రమణ మొదటి భార్య, పిల్లలు ఉండగా.. భాగ్యలక్ష్మిని ద్వితీయ వివాహం చేసుకున్నాడు. భాగ్యలక్ష్మికి పిల్లలు కలగ లేదు. మొదటి భార్య అంగీకారంతో ముగ్గురు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారని పోలీసులు తెలిపారు. నిందితుడు అజయ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుధాకరరావు తెలిపారు.

అనారోగ్యంతో మారేడుపూడి ఎంపీటీసీ సభ్యుడి మృతి

అనకాపల్లి రూరల్, జూన్ 24: మండలంలోని మారేడుపూడి ఎంపీటీసీ సభ్యుడు ఈగల రామునాయుడు(45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సోమవారం ఉదయం సుమారు ఆరున్నర గంటల సమయంలో కడుపులో నొప్పిగా ఉందని ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కుటుంబసభ్యులను కోరారు. వారు తీసుకువెళ్లేందుకు సిద్ధపడే లోపే మృతి చెందారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సర్పంచ్‌గా ఆయన పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ ఎంపీటీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆయన సోదరుడు పెదబాబుతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు రామునాయుడు భౌతికాయానికి నివాళులు అర్పించారు. ఆయనకు భార్య దేవి, కుమారుడు కేశవ, కుమార్తె ఉన్నారు.

20 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

- కారు, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్

పాడేరు రూరల్, జూన్ 24: మన్యం నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కారు, రెండు ద్విచక్రవాహనాలు సీజ్ చేసినట్టు సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్ తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం కందమామిడి జంక్షన్ వద్ద ఎస్‌ఐ జి.లక్ష్మణరావు బృందం వాహన తనిఖీలను నిర్వహిస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో అటుగా వచ్చిన కారును నిలిపి తనిఖీ చేయగా అందులో 20 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అరెస్టు చేసి కారు సీజ్ చేశామన్నారు. అదే విధంగా గంజాయి రవాణాకు సహకరించిన మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన నిందితులు జి.మాడుగుల మండలం బూరుగు గ్రామానికి చెందిన పాంగి కృష్ణారావు(30), జి.మాడుగుల మండలం గద్దెరాయి గ్రామానికి చెందిన గొల్లోరి నారాయణ(24), విశాఖపట్నం ఆరిలోవ డైరీఫారం ప్రాంతానికి చెందిన అలజంగి పోలిరాజు (25)గా గుర్తించామన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, జూన్ 24 : అనకాపల్లి మండలం రామాపురం వద్ద సోమవారం ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలైనట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సోమశేఖరరావు తెలిపారు. మాడుగుల మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన గట్టా పార్వతి, మరికొందరు ప్రయాణికులతో ఆటోలో అనకాపల్లి వైపు నుంచి స్వగ్రామం వెళ్తుండగా రామాపురం కాలనీ వద్ద లారీ ఢీకొనడంతో పార్వతి చేతికి బలమైన గాయాలయ్యాయన్నారు. ఆటో డ్రైవర్ శ్రీనుకు స్వల్పగాయాలయ్యాయని, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

డీఆర్‌వోగా శ్రీనివాస్‌కు బాధ్యతలు

అనకాపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో)గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌కు సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పనిచేసిన డీఆర్‌వో బలివాడ దయానిధి వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. దీంతో కలెక్టరేట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, గృహ నిర్మాణ సంస్థ పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి.. డీఆర్‌వోగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంతులీనిన క్లాక్‌టవర్

- ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం
- నగరానికి సరికొత్త శోభ
- జగదాంబ కూడలికి స్పెషల్ అట్రాక్షన్



క్లాక్‌టవర్ కాంతులీనింది. జగదాంబ కూడలిలో నిర్మించిన క్లాక్‌టవర్‌కు అమర్చిన విద్యుత్ దీపాలను సోమవారం సాయంత్రం వెలిగించడంతో ఆ ప్రాంతమంతా ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఉదయం స్తంభానికి నలువైపులా అమర్చిన గడియారాలను ప్రారంభించారు. సాయంత్రానికి మిగిలిన పనులు పూర్తిచేసి విద్యుత్ దీపాలను వెలిగించడంతో క్లాక్‌టవర్‌ను చూసేందుకు జనం ఉత్సాహం చూపించారు. ప్రారంభోత్సవం జరిగిన తరువాత ప్రత్యేక గంటల శబ్దం నగరవాసులను కొత్త అనుభూతికి గురిచేయనుంది.

\- జగదాంబకూడలి

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

తిమిరాంలో ఆక్రమణదారుల బరితెగింపు



శీలావాని చెరువులో ఉపాధి పనులు అడ్డుకుంటున్న ఆక్రమణదారులు



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

- చెరువుల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలపై దౌర్జన్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తిని హత మారుస్తామని బెదిరింపులు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల ధర్నా
- చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు వినతిపత్రాలు

దేవరాపల్లి, జూన్ 24: మండలంలోని తిమిరాం గ్రామ చెరువుల్లో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై ఆక్రమణదారులు దౌర్జన్యానికి దిగారు. పనులు చేయడానికి వీలు లేదంటూ కూలీలపై దాడి చేశారు. పనులు చేయకుండా ఉపాధి కూలీలకు అడ్డు తగిలారు. వివరాల్లోకి వెళితే..

తిమిరాం గ్రామంలో శ్రీరామ చెరువు, పనుకు బంద, కుమ్మరిగాత చెరువుల్లో ఉపాధి పనులు చేసేందుకు 150 మంది కూలీలు సోమవారం వెళ్లారు. ఉపాధి హామీ పథకం మేట్లు చెప్పిన ప్రకారం ఈ మూడు చెరువుల్లో పనులు చేస్తున్న కూలీలను పనులు చేయవద్దని ఆక్రమణదారులు అడ్డగించారు. వారి పనిముట్లను తీసుకున్నారు. తమను పని చేసుకోనివ్వమని కూలీలు కోరారు. అయినా ఆక్రమణదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వారిపై దాడి తెగబడ్డారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు, ఆక్రమణదారుల మధ్య తోపులాట జరిగింది. ఆ సమయంలో అప్పలనాయుడు అనే ఉపాధి కూలీపై ఆక్రమణదారులు దాడి చేశారు. దీంతో పనులు ఆపేసిన ఉపాధి కూలీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ముసలినాయుడుని హత మార్చుతామని హెచ్చరించారు. నానా దుర్భాషలాడారు. దీంతో ఉపాధి కూలీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పనులు లేక చిననందిపల్లి గ్రామాలకు వెళ్లేవారమని, గ్రామంలో ఉన్న చెరువుల్లోని ఆక్రమణలు తొలగించి పనులు కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ సుబ్బలక్ష్మి, ఉపాధి ఏపీఓ చంద్రకళకు వినతి పత్రాలు ఇచ్చారు. తాము ఈ భూముల్ని 1962 నుంచి సాగు చేస్తున్నామని, గ్రామంలో ఉన్న ఆక్రమణలన్నీ తొలగిస్తే స్వచ్ఛందంగా భూములను విడిచి పెడతామని ఆక్రమణదారులు విలేకరులకు తెలిపారు.

అభినందనల వెల్లువ



మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న హోం మంత్రి అనిత



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిత

రాష్ట్ర ఐటీ, విద్య, ఆర్టీజీ మంత్రిగా సోమవారం అమరావతిలోని సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌కు హోం మంత్రి వంగలపూడి అనిత పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జన్మభూమికి గ్రీన్‌సిగ్నల్

- సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా...
- నేటి నుంచే పునఃప్రారంభం
- రైళ్లు రద్దుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఒక అడుగు వెనక్కి తగ్గిన అధికారులు
- సింహాద్రి, రత్నాచల్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు ఇంకా దక్కని ఊరట

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు డిమాండ్ పెంచుకోవడానికి సాధారణ ప్రయాణికులు ఎక్కువగా వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో రైల్వే శాఖ ఒక అడుగు వెనక్కి తగ్గింది. విజయవాడ డివిజన్‌లో భద్రతా పరమైన తనిఖీలు నిర్వహిస్తున్న కారణంగా జూన్ 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ఎనిమిది జతల రైళ్లను రద్దు చేస్తున్నట్టు రెండు రోజుల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు పునరాలోచించారు. ఆపరేషన్ల పేరుతో ఉన్నతాధికారులు రద్దు చేసిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో పాటు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ఇవి జూన్ 25వ తేదీ అంటే మంగళవారం నుంచే ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805/12806) లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడుస్తుంది. అలాగే సర్కార్ ఎక్స్‌ప్రెస్ తమిళనాడులోని చెంగల్పట్టు నుంచి బయలుదేరి చెన్నై, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట మీదుగా కాకినాడ చేరుతుంది. దీనిని కూడా పునరుద్ధరించారు. ఇంకా విశాఖపట్నం-గుంటూరు మధ్య సింహాద్రి ఎక్స్‌ప్రెస్, విశాఖ-విజయవాడ మధ్య రత్నాచల్, విశాఖ-తిరుపతిల మధ్య డబుల్ డెక్కర్ రైళ్లను పునరుద్ధరించాల్సి ఉంది. వీటికి కూడా విపరీతమైన రద్దీ ఉంటుంది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం నగరాల మధ్య తిరిగేవారు అత్యధికంగా ఈ రైళ్లనే ఆశ్రయిస్తారు. ఇవన్నీ కూడా వందేభారత్ రైలు బయలుదేరడానికి ఒక గంట అటుఇటుగా బయలుదేరేవి కావడం గమనార్హం. వీటిని రద్దు చేస్తే ఆ ప్రయాణికులు అంతా తప్పనిసరి స్థితిలో వందే భారత్‌ను ఆశ్రయిస్తారని, తద్వారా ఆక్యుపెన్సీ పెరిగి ఎక్కువ ఆదాయం వస్తుందనేది రైల్వే పెద్దల ఆలోచన. ఈ డిమాండ్‌ను చూపించి, అదనంగా మరికొన్ని వందేభారత్ రైళ్లు నడపాలన్నదే వారి ప్రణాళిక. గత ఏడాది జనవరి నుంచి సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఒక వందేభారత్ రైలు నడుస్తుండగా, మూడు నెలల క్రితం మరొకటి వేశారు. విజయవాడ-విశాఖపట్నం మధ్య కూడా వందే భారత్ ప్రారంభించే అవకాశం ఉందని రైల్వే ఉద్యోగుల సమాచారం. తక్కువ రేటుతో సామాన్యులు ప్రయాణించే రైళ్లను క్రమంగా రద్దు చేసి, ఎక్కువ ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్లను తమ బ్రాండ్‌తో ప్రమోట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇదంతా చేస్తున్నదనే విమర్శలు ఉన్నాయి.

ప్రధానమైన రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లనే కాకుండా గుంటూరు-రాయగడ పాసింజర్ రైలు, ఇటు విశాఖపట్నం-గుణుపూర్ రైళ్లను కూడా రద్దు చేశారు. అటు విజయవాడ నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఎంపీలు రైళ్ల రద్దు సమస్యను సీరియస్‌గా తీసుకొని, సామాన్య ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే దీనిపై ప్రతి ఎంపీ గొంతు విప్పాల్సిన అవసరం ఉంది.

అర్జీలపై తక్షణమే స్పందించాలి

ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై తక్షణమే స్పందించి అర్జీదారులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అందే ప్రతీ అర్జీపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమం ముగిసేసరికి 22 అర్జీలు అందగా, వాటిలో ప్రధానంగా భూతగాదాలు, మోసాలు, కుటుంబ కలహాలు వంటి వాటిపై ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, ఎస్‌ఐ దివ్య తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

నిరుపయోగంగా సంపద కేంద్రాలు



వృథాగా ఉన్న సూరెడ్డిపాలెం సంపద కేంద్రం



మందుబాబులకు అడ్డాగా మారిన వి.సంతపాలెం సంపద కేంద్రం

వృథాగా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం

- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- కూటమి ప్రభుత్వం రాకతో మంచి రోజులు

కె.కోటపాడు, జూన్ 24 : వైసీపీ ప్రభుత్వ హయాంలో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారిపోయాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు వృథాగా మారిపోయాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలు మందుబాబులకు అడ్డా అయ్యాయి. అధికారులు వీటిని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవడంతో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కె.కోటపాడు మండల పరిధిలో 32 సంపద కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క సంపద కేంద్రానికి ఐదు నుంచి ఏడు లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. ఈ సంపద కేంద్రాలను కొద్ది రోజులు తూతూ మంత్రంగా నిర్వహించి వదిలేశారు. తడి, పొడి చెత్తలను పారిశుధ్య కార్మికులు సంపద కేంద్రాలకు తరలించి అక్కడ ఎరువుగా తయారు చేసేవారు. అనంతరం ఆ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేది. కానీ వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాగానే సంపద కేంద్రాలకు వైసీపీ రంగులు వేసుకోవడానికే మాత్రమే ఉపయోగించారు. ఈ కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో కె.సంతపాలెం, సూరెడ్డిపాలెం తదితర కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంపద కేంద్రాలకు మంచి రోజులు వస్తాయని పలువురు అంటున్నారు.

పూడిమడకలో అలల ఉధృతి

- ముందుకు వచ్చిన సముద్రం
- వలలను సురక్షిత ప్రాంతానికి తరలించిన మత్స్యకారులు



పూడిమడక తీరంలో అలల ఉధృతి

అచ్యుతాపురం, జూన్ 24: పూడిమడక తీరంలో సముద్రం బాగా ముందుకు వచ్చింది. సోమవారం మధ్యాహ్నం నుంచి అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఇళ్ల వరకు నీరు వచ్చేసింది. దీంతో మత్స్యకారులు అప్రమత్తమై వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పడవలు కూడా సురక్షితంగా ఉండడానికి చర్యలు చేపట్టారు. చీకటి పడే వరకు పూడిమడక తీరంలో అలల ఉధృతి కొనసాగింది.

ఆరోగ్యమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా గోవింద



పీహెచ్ గోవింద

అనకాపల్లి టౌన్, జూన్ 24: ఆరోగ్యమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా చవ్వాకుల గోవింద ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం తెలిపారు. సంఘ సమావేశం విజయవాడలో ఆదివారం జరిగిందని తెలిపారు. అధ్యక్షునిగా గోవింద, ప్రధాన కార్యదర్శిగా గురవయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా దేవేంద్రనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వల్లూరి బంగారుశ్రీ ఎన్నికయ్యారన్నారు. కార్యదర్శులుగా సుధీర్, శేఖర్, ప్రభావతి, కృష్ణ, మూర్తి, కోశాధికారిగా రామ్మోహన్‌తో పాటు పలువురు కార్యవర్గసభ్యులను సమావేశంలో ఎన్నుకున్నారని పేర్కొంటూ వీరి ఎన్నిక పట్ల భద్రం హర్షం వ్యక్తం చేశారు.

మట్టి తవ్వకాలు జరిపిన పొలాల పరిశీలన

రాంబిల్లి, జూన్ 24: మండలంలోని కొత్తూరు, నారాయణపురం, చినకలవలాపల్లి, గోకివాడ గ్రామాల్లో మట్టి తవ్వకాలు జరిపిన పంట పొలాలను సోమవారం మైన్స్ అధికారులు పరిశీలించారు. మైన్స్ జిల్లా అధికారి ఆదేశాల మేరకు మైన్స్ అధికారిణి స్వాతి సిబ్బందితో మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశాలను, ఫిల్లింగ్ చేసిన ప్రదేశాలను పరిశీలించారు. మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించి, ఎంత మేరకు మట్టి తవ్వకాలు జరిపారో కొలతలు తీశామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి తెలిపారు. ఈ మేరకు సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసి అపరాధ రుసుము వసూలు చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు, మామిడివాడ రెవెన్యూ వీఆర్వోలు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, జూన్ 24 : వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఎస్. కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉన్నారు. ఎమ్మెల్యేలకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో ఎమ్మెల్యేల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి వేదాశీర్వచనాలను, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

పట్టుదలతో ఐపీఎస్ సాధించా..

- ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయినా వెనకడుగు వేయలేదు
- సప్లిమెంటరీలో ఉత్తీర్ణుడినయ్యా..
- ఉచిత చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదిగా..
- ఉత్తరప్రదేశ్ అడిషనల్ డీజీపీ కిల్లాడ సత్యనారాయణ



ఐపీఎస్ కిల్లాడ సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ

కోటవురట్ల, జూన్ 24: ప్రభుత్వ పాఠశాలలోనే చదివి పట్టుదలతో ఐపీఎస్ సాధించానని ఉత్తరప్రదేశ్ అడిషనల్ డీజీపీ కిల్లాడ సత్యనారాయణ తెలిపారు. సోమవారం తాను చదువుకున్న పాములవాక హైస్కూల్‌ను తన కుమారుడు సుజన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుంటే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. తాను ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, అయితే కష్టపడి చదివి సప్లిమెంటరీలో ఉత్తీర్ణుడినయ్యానని చెప్పారు. డిగ్రీ అనకాపల్లి ఏఎంఎల్ కాలేజీ, పీజీ ఏయూలో చదివానని చెప్పారు. సివిల్స్ పరీక్ష కోసం ఏపీ స్టడీ సర్కిల్‌లో చదువుకున్నానన్నారు. తాను నర్సీపట్నం మండలం బలిఘట్టంలో స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా పని చేశానని, సివిల్స్ పరీక్షలో నాల్గవ ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధించానని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని ఈ స్థాయికి ఎదిగానని ఆయన తెలిపారు. ఆయనను పాఠశాల హెచ్ఎం కేవీ లక్ష్మీనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ అచ్యుతరావు సత్కరించారు.

పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూన్ 24: జబల్‌పూర్ సెక్షన్‌లో ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ నుంచి నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 27, జూలై 4న విశాఖ - భగత్ కి కోఠి ఎక్స్‌ప్రెస్ (18573), ఈనెల 29, జూలై 6న భగత్‌కి కోఠి - విశాఖ ఎక్స్‌ప్రెస్ (18574), జూలై 5, 6, 9న విశాఖ - అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20807) రద్దు చేసినట్టు పేర్కొన్నారు. జూలై 6, 7, 10న అమృతసర్ - విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) రైళ్లను రద్దు చేశారు. కాగా, విశాఖ నుంచి అమృతసర్ వెళ్లే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు (20 807) ఈనెల 25, 28, 29, జూలై 2న మల్కెడి స్టేషన్ వద్ద హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

జూలై 20న సింహ గిరి ప్రదక్షిణ

- సింహాచలం ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, జూన్ 24: లక్షలాదిమంది భక్తులు పాల్గొనే సింహగిరి ప్రదక్షణ విజయవంతానికి ముందస్తు ప్రణాళికలతో కృషిచేద్దామని అధికారులకు సింహాచల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి తన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గిరి ప్రదక్షిణకు చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం కొండచుట్టూ 30 స్టాల్స్, 275 టాయిలెట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గిరిప్రదక్షిణకు లక్షలాదిగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా కనీస వసతుల కల్పనపై అధికారులంతా దృష్టి సారించాలని ఆదేశించారు. నగరానికి చెందిన పలు ప్రభుత్వ శాఖలతో సమన్వయ పరచుకోవాలని, ఆయా శాఖలకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. జూలై 20న సాయంత్రం 4గంటలకు స్వామివారి పుష్పరథం కొండదిగువ తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభించడంతో గిరి ప్రదక్షిణ మొదలవుతుందన్నారు. ఉత్సవం జరుగు 20, 21 తేదీల్లో అప్పన్న ఆలయంలో అన్ని ఆర్జిత సేవలు రద్దు జరుగుతాయన్నారు. 20న ప్రదక్షిణ చేసి సింహగిరికి చేరుకునే భక్తులకు రాత్రి 10గంటల వరకు స్వామివారి దర్శనాలు కల్పిస్తామని, 21న సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని ఆలయ స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ సమావేశంలో స్పష్టం చేశారు. ఉత్సవం విజయవంతానికి పోలీసు, జీవీఎంసీ, తదితర ప్రభుత్వ శాఖలతో త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరమణాచార్యులు పాల్గొన్నారు.



ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీ

గుణాత్మక విద్యనందించాలి: డీఈవో బ్రహ్మాజీ

డుంబ్రిగుడ, జూన్ 24: విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ సూచించారు. మండలంలోని అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ప్రవేశాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. అలాగే తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలని ఆదేశించారు. పదో తరగతిలో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరరావు, సత్యనారయణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పాడేరులో చిల్లర దొంగల బీభత్సం

భయాందోళనలో వాహనదారులు



కారు అద్దాలు పగులగొట్టిన ఆకతాయిలు

పాడేరు రూరల్, జూన్ 24: జిల్లా కేంద్రం పాడేరులో రోజురోజుకూ ఆకతాయిలు, చిల్లర దొంగల బెడద పెరిగిపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రాత్రి సమయంలో ఆకతాయిలు సంచరిస్తూ అవకాశం ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. అలాగే అవకాశం లేని పాతబడిన ద్విచక్రవాహనాల నుంచి పెట్రోలను చోరీ చేస్తున్నారు. ఆదివారం రాత్రి అంబేడ్కర్ కూడలిలోని పాత బస్టాండ్‌కు సమీపంలో జంగిల్ రెస్టారెంట్, వీఎస్ఆర్ ప్రింటర్స్ మధ్యలో నిలిపి ఉన్న కారు ముందు, వెనుక అద్దాలను పగలుగొట్టి, అందులో ఉన్న కొన్ని సాధారణ వస్తువులను దొంగిలించారు. దీంతో వాహనాలను రాత్రి సమయంలో ఇంటి బయట నిలిపి నిద్రించడానికి ప్రజలు భీతిల్లిపోతున్నారు. పోలీసు అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో గస్తీని ముమ్మరం చేయాలని, రాత్రి పూట రోడ్లపై తిరిగే ఆకతాయిలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు కృషి చేద్దాం..



అరకులో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

అరకులోయ, జూన్ 24: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేద్దామని పోలీసులు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సోమవారం ర్యాలీ చేశారు. పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి రవాణాను నిర్మూలించాలని వారు నినాదాలు చేశారు. డ్రగ్స్, గంజాయి రవాణా, వ్యాపారం, ఉత్పత్తి కేంద్రాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేకంగా 14500 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఈ సందర్భంగా ఎస్ఐ రేణుక తెలిపారు. డ్రగ్స్ రవాణా జరిగినట్టు తెలిస్తే ఈ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ ర్యాలీలో పాఠశాల డైరెక్టర్ శ్రీధర్, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేయొద్దు: సీఐ రమేశ్

చింతపల్లి, జూన్ 24: ఆదివాసీలు గంజాయి సాగు చేయకూడదని సీఐ కె.రమేశ్ సూచించారు. మండలంలోని సీపీఐ మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఏవోబీ సరిహద్దు బలపం పంచాయతీ ఎగజనబ, దిగజనబ, జోహార్, చెరువూరు గ్రామాల్లో సోమవారం పోలీసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు, గిరిజనులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గిరిజనులు గంజాయి సాగు, రవాణాను పూర్తిగా విడిచి పెట్టాలన్నారు. గంజాయి సాగు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటుందన్నారు. అలాగే మావోయిస్టులకు సహకరించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్ఐ రాజారావు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

కొమ్మంగి రహదారికి మోక్షం

... 5వ పేజీ తరువాయి

విదల్చలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు.

ప్రభుత్వం మారడంతో నిర్మాణాలు పునఃప్రారంభం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్ నిర్మాణాలు పునఃప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి ఇప్పటివరకు ఒక్కపైసా నిధులు విడుదల కాకపోయినా, రహదారి నిర్మాణాలు పూర్తి చేస్తే చంద్రబాబునాయుడు నిధులు విడుదల చేస్తారనే నమ్మకంతో కాంట్రాక్టర్ తారు రోడ్డు నిర్మాణాలు ఐదు రోజుల క్రితం ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి 70 శాతం పనులు పూర్తి చేశారు. 700 మీటర్ల ఘాట్ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నెలాఖరు నాటికి కొమ్మంగి రహదారి పనులు శతశాతం పూర్తి చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ తెలిపారు.

గోదావరినీ వదలని షెకావత్

... 5వ పేజీ తరువాయి

ద్వారా లబ్ధిపొందుతూ వచ్చారు. అంతేకాకుండా గిరిజనుల ఆటోను స్వాధీనం చేసుకుని చలానా కట్టించుకుని, వారి వలలను స్వాధీనపర్చుకుని దళారీ వద్దనే ఉంచి గిరిజనులు వేటాడకుండా చేశారు. ఈ మొత్తం బాగోతం వెనుక ఇటీవల కాలంలో అటవీ శాఖలో టేకు చెట్ల నరికివేతతో పాటు పలు అక్రమాలను ప్రోత్సహించిన ఓ ఉన్నతాధికారే ఉండడం ఎవరినీ ఆశ్చర్యపర్చడం లేదు. కాగా ఊహించని రీతిలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం ఈ అక్రమార్కులకు, వారిని ప్రోత్సహించే అధికారులకు మింగుడుపడనిదిగా మారింది. దీంతో కొత్త పాలన, కొత్త అధికారుల రాకతో గిరిజన నిర్వాసితులలో కూడా ఈ అక్రమార్కుల పీడ వదిలిపోతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

మన్యంలో జోరుగా పైనాపిల్ విక్రయాలు

... 5వ పేజీ తరువాయి

పైనాపిల్ తోటల పెంపకాన్ని గిరిజన రైతులు చేపడుతున్నప్పటికీ చాలా కాలంగా ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం అందడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, అనుభవాలే పాఠాలుగా గిరి రైతులు పైనాపిల్ తోటల పెంపకాన్ని చేపడుతున్నారు. అలాగే మార్కెటింగ్ పరంగానూ ప్రభుత్వం నుంచి ఎటువంటి తోడ్పాటుని అందించడం లేదు. దీంతో తమకు పరిచయం ఉన్న వర్తకులకు విక్రయించడం, రోడ్ల పక్కన పర్యాటకులు, ప్రయాణికులకు అమ్మకాలు చేసుకోవడం మినహా మరో మార్గం లేని దుస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి చాలా ఏళ్లుగా కొనసాగుతుండడంతో పైనాపిల్ తోటలను పెంచుతున్న గిరిజన రైతులు ప్రభుత్వంపై ఆధారపడడం, అధికారులు సాయం చేస్తారని ఆశ పడడం మానేశారు.

పైనాపిల్ ప్రోసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు ఎప్పుడో...?

ఏజెన్సీలో గిరిజన రైతులు పెద్ద ఎత్తున పైనాపిల్ తోటలను పెంచుతున్నప్పటికీ, వాటిని అనుబంధంగా ప్రోసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేస్తామని పాలకుల హామీలు కలగానే మిగిలి పోతున్నాయి. వాస్తవానికి పైనాపిల్‌ను అధికంగా పండిస్తున్న నేపథ్యంలో ఏజెన్సీలో పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో వాటి ఆధారిత ప్రోసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేస్తే, గిరిజన రైతులకు అదనపు ఆదాయం సమకూరడంతోపాటు ధర సైతం పడిపోని పరిస్థితి ఏర్పడుతుంది. కానీ ఆ దిశగా పాలకులు కనీసం దృష్టి సారించడం లేదు. దీంతో ఏజెన్సీలో పైనాపిల్ రైతులు వాటిని మామూలుగా రోడ్లపైనే విక్రయించుకుంటున్నారు.

చుట్టుమెట్టలో ప్రత్యేక వైద్య శిబిరం

- గ్రామస్థులందరికీ ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు
- రసాయనిక వాయువు వెలువడి ఇద్దరు మృతి చెందారని వివరించిన డీఎంహెచ్‌వో జమాల్ బాషా
- మూఢ నమ్మకాల జోలికి వెళ్లవద్దని హితవు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పెదబయలు, జూన్ 24: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామంలో ఇద్దరి మృతి చెందారని పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా స్పందించి, గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో జమాల్ బాషా విలేకరులతో మాట్లాడుతూ చుట్టుమెట్ట గ్రామస్థులు మూఢనమ్మకాలు పెట్టుకోవద్దని సూచించారు. భూత వైద్యుడు కిముడు సహదేవ్, కిల్లో త్రినాథ్‌ల మరణాలు రసాయనిక పొగ వలనే సంభవించాయన్నారు. ఇనుప కొడవళి వేడి చేసి అందులో వివిధ అటవీ మూలికలతో తయారు చేసినా ధూపం వేసి ఊదడం వలన అందులో నుంచి ఒక రకమైనా రసాయన వాయువు వెలువడి ఎదురెదురుగా ఉన్న ఇద్దరి ఊపిరితిత్తులకు, మెదడుకి చేరి అపస్మారక స్థితికి చేరి వాంతులు, విరేచనలు జరిగి మరణించారని వివరించారు. అంతేగానీ గాలి, భూతం వంటివన్ని అపోహలే అని అన్నారు. కారడవిలో పాంగి అనాసమ్మ మామిడి పండ్లు ఏరుతున్న సమయంలో చెట్టు కొమ్మ విరిగిన శబ్దానికి భయం చెంది భూత వైద్యుడుని ఆశ్రయించడం మరణాలకు మూల కారణమన్నారు. ప్రజలకు ఎవరికీ ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. రోగ తీవ్రతను బట్టి జిల్లా ఆస్పత్రికి తరలిస్తామన్నారు. మూఢనమ్మకాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. ఆయన వెంట మానసిక వైద్య నిపుణులు, ప్రత్యేక వైద్యులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మెగా డీఎస్సీపై గిరిజన ఉద్యోగుల సంఘం హర్షం

పాడేరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో మెగా డీఎస్సీని ఆమోదిస్తూ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. అమరావతిలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, పార్వతీపురం మన్యం జిల్లా కన్వీనర్ కొండగొర్రె ధర్మారావు సారథ్యంలో రాష్ట్ర హోం మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులతో వారు మాట్లాడుతూ జీవో నంబరు 3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకొనేలా మంత్రులు కృషి చేయాలని కోరామన్నారు. ఈ చట్టం ద్వారా మాత్రమే షెడ్యూల్ ప్రాంతంలో శతశాతం ఉపాధ్యాయ పోస్టులు స్థానిక ఆదివాసీలకు దక్కి న్యాయం జరుగుతుందని వివరించారు. అందుకు మంత్రులు సుముఖత చూపడం ఆనందంగా ఉందన్నారు. మంత్రులను కలిసిన వారిలో డాక్టర్ టి.బాబూరావునాయుడు, గుబ్బరి గురుదొర, జగన్నాథరెడ్డి, ముక్కయ్య, రవిప్రసాద్ ఉన్నారు.



అమరావతిలో హోం మంత్రిని కలిసిన గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు శేషాద్రి, నాయకులు

బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి

ముంచంగిపుట్టు, జూన్ 24: బడిఈడు పిల్లలు విధిగా పాఠశాలలకు వచ్చేలా చూడాలని ఎంఈవో కె.క్రిష్ణమూర్తి సూచించారు. కించాయిపుట్టు మండల పరిషత్ పాఠశాలను సోమవారం సందర్శించి విద్యార్థులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను చదివించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పిల్లలు బడిలో ఉండాలన్న ఉద్దేశంతో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలను బడికి పంపించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు.

రాష్ట్రాన్ని రావణ కాష్టం నుంచి రక్షించారు..

- జనసేన పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంగులయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగులయ్య

పాడేరు రూరల్, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి అధికారం ఇచ్చి రాష్ట్రాన్ని రావణ కాష్టం నుంచి రక్షించారని జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరు గంగులయ్య అన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రమంతా ఒక వైపు ఉంటే గిరిజన ప్రాంతమైన పాడేరు, అరకు మరోవైపు ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఈ ఫలితాలపై పాడేరు, అరకు ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. జీవో నంబరు 3 వల్ల గిరిజన యువతకు జరిగే నష్టాలను సీఎం, డిప్యూటీ సీఎంకు వివరించి గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు తన వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన జనసేన నాయకులు ఎస్.మురళి, ఎస్.భూపాల్, ఎస్.అశోక్, ఎం.సుబ్బారావు, సీహెచ్.అనీల్‌కుమార్, వి.సురేష్, ఎం.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో సందేశాత్మక చిత్రాల ప్రదర్శన

చింతపల్లి, జూన్ 24: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో ప్రతీ ఆదివారం సందేశాత్మక చిత్రాలను ప్రదర్శించనున్నట్టు ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి చెప్పారు. లంబసింగి బాలికలు, బాలుర ఆశ్రమ పాఠశాలలు, రాజేంద్రపాలెం, అసరాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆమె సందర్శించారు. ముందుగా విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ పాఠశాలలో శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలని స్పష్టం చేశారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందించాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనాలు పెట్టాలని సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అలాగే విద్యా కిట్లను పూర్తి స్థాయిలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీరభద్రరావు, బీఎస్ఎన్ పడాల్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన అవసరం

- గిరిజనులను అధికారులు చైతన్యపరచాలి
- గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సమాఖ్య నాయకులు

పాడేరు రూరల్, జూన్ 24: మారుమూల ఆదివాసీ గ్రామాల్లో ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన అవసరమని, ఇందుకోసం అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలకు ఆదివాసీలు బలవుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూడడం అన్యాయమన్నారు. మూఢనమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాధులు ప్రబలినప్పుడు, అనారోగ్యాలకు గురైనప్పుడు అమాయక ఆదివాసీలు భూత వైద్యులను నమ్మి అనేక మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని వాపోయారు. చుట్టుమెట్ట గ్రామంలో ఇద్దరు మృత్యువాత పడడం విచారకరమన్నారు. ఈ కథనాలుపత్రికల్లో వచ్చిన మూడు, నాలుగు రోజుల తరువాత వైద్య సిబ్బంది ధీమాగా గ్రామాలను సందర్శించి తూతూ మంత్రంగా వైద్య శిబిరాలను నిర్వహించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో మూఢనమ్మకాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి అమర్, కృష్ణ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్

కొయ్యూరు, జూన్ 24: కొయ్యూరు మండలంలోని పిట్టచలం గ్రామంలో హెచ్‌పీఈఎల్ పెట్రోల్ బంకు నిర్వహణకు గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బంకును రెండేళ్ల కాల పరిమితితో లీజు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇందుకోసం ఐటీడీఏ పరిధిలోని గిరిజనుడై ఉండి డిగ్రీ అర్హత కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. లీజు దారుడు పూర్తి నిర్వహణకు ఏక మొత్తంలో రూ.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే మొదటి సంవత్సరం నెలకు రూ.50 వేలు వంతున, రెండో ఏడాది నెలకు రూ.75 వేలు అద్దె చెల్లించి బంకు నిర్వహించుకోవాలని పీవో తెలిపారు. దరఖాస్తుతో పాటు రూ.లక్ష బ్యాంకు డీడీ కూడా అందజేయాలని, ఎంపిక కాకపోతే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని చెప్పారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చే నెల 8వ తేదీ లాటరీ పద్ధతిలో అభ్యర్థి ఎంపిక జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఐటీడీఏకు స్వయంగా ఇవ్వాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440972048 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా డాక్టర్ అప్పలస్వామి



నూతన ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పూర్వ ఏడీఆర్ సురేశ్

చింతపల్లి, జూన్ 24: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు (ఏడీఆర్)గా డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి నియమితులయ్యారు. తాజా బదిలీల్లో రెండేళ్ల పాటు పరిశోధన స్థానంలో ఏడీఆర్‌గా పనిచేసిన డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ బాపట్ల అగ్రికల్చర్ కళాశాలకు బదిలీ అయ్యారు. అలాగే కొక్కరాపల్లి(ఎలమంచిలి) నూనె గింజల పరిశోధన స్థానం అధిపతిగా ఏడాది పాటు విధులు నిర్వహించిన అప్పలస్వామిని చింతపల్లి ఏడీఆర్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు సోమవారం ఆయన చింతపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన అప్పలస్వామికి పూర్వ ఏడీఆర్ సురేశ్ కుమార్, శాస్త్రవేత్త సీదరి ఉజ్వల పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అప్పలస్వామి విలేకరులతో మాట్లాడుతూ గిరిజన రైతులకు రాజ్‌మా, వలిసెలు, వరిలో నాణ్యమైన అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్‌హెచ్ నిర్మాణంలో పరిహారానికి సంప్రదించండి



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, జూన్ 24: జాతీయ రహదారి 516-ఈ నిర్మాణంలో పరిహారం అందని బాధితులు రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెదబరడ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి నిర్మాణాల్లో గృహాలు, భూములు కోల్పోతున్న గిరిజనులకు పరిహారం అందలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికీ జాతీయ రహదారి నిర్మాణాల్లో భూములు, గృహాలు కోల్పోతున్న గిరిజనులకు పరిహారం అందకపోతే అర్జీ అందిస్తే సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలతో కిక్కిరిసిన ఆస్పత్రి

మాడుగుల, జూన్ 24: స్థానిక పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 206 మంది హాజరైనట్టు డాక్టర్ రవిచంద్రశేఖర్ తెలిపారు. వారందరికీ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చామన్నారు. డాక్టర్ నాగమణికంఠ, సిబ్బంది ఎన్.ప్రకాశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సీఎం చంద్రబాబును కలిసిన శ్రావణ్



అరకులోయ, జూన్ 24: అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సోమవారం టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ కలిశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జీవో నంబర్-3 పునరుద్ధరణ, గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ, గిరిజనుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందించినట్టు శ్రావణ్ తెలిపారు. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని ఆయన చెప్పారు.

ప్రతీ గృహానికి విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ ఏఈఈ ప్రభాకరరావు

చింతపల్లి, జూన్ 24: గిరిజన ప్రాంతంలో ప్రతీ గృహానికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన ప్రాంతంలో ప్రతీ కుటుంబం విద్యుత్ కనెక్షన్ కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ మేరకు గ్రామాల్లో అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు నిర్మిస్తున్నామన్నారు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో ఇప్పటివరకు 2,571 పీవీటీజీ, 1,684 నాన్ పీవీటీజీ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశామన్నారు. మరో 500 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు విద్యుత్ సదుపాయం లేని గృహాలకు విద్యుత్ మీటర్, సర్వీస్ వైర్, వుడ్ బోర్డు, ఎంసీబీ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐ గంగరాజు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తుకు ముప్పు



సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రాజు

కొయ్యూరు, జూన్ 24: మత్తు పదార్థాలతో భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని చింతపల్లి ఎక్సైజ్ సీఐ వై.రాజు చెప్పారు. మండలంలోని డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే మత్తు పదార్థాలను రవాణా చేసే వ్యాపారుల వలలో పడవద్దని చెప్పారు. గంజాయి లాంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, వాటిని రవాణా చేస్తే ఎదుర్కొనే శిక్షణలను హెడ్ కానిస్టేబుల్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రభుదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన

జి.మాడుగుల, జూన్ 24: విద్యార్థులు డ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సీఐ రమేశ్ తెలిపారు. సోమవారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలను పాటించి మంచి మార్గంలో పయనించాలని చెప్పారు. ప్రధానంగా చదువులో ఏకాగ్రతతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

పిల్లలంతా బడికి చేరాలని ర్యాలీ

పెదబయలు, జూన్ 24: బడి బయట ఉన్న పిల్లలంతా విధిగా పాఠశాలల్లో చేరాలని కోరుతూ మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాల నుంచి మూడు రోడ్ల కూడలి వరకు పలు నినాదాలతో ర్యాలీ సాగించారు. అనంతరం అంబేడ్కర్ పార్కు వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారపు సంతలో ఎంఈవో కొమ్ము క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, విద్యా కమిటీ సభ్యులు గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠశాలలోనే ఉండాలన్నారు. బడి ఈడు పిల్లలను ఇంటిలో ఉంచితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల పంపిణీ

కొయ్యూరు, జూన్ 24: మండలంలోని బాలారం, బకులూరు పంచాయతీలలో సర్పంచులు అప్పన అప్పల నర్స, పొట్టిక శ్రీను సోమవారం రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. విత్తనాల మొలక శాతం పరీక్షించిన అనంతరమే మేలురకంగా ధ్రువీకరించిన విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు ఈ సందర్భంగా వారు చెప్పారు. వీటిని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల సహాయ కార్యదర్శి బంటు లక్ష్మణ్, నాయకులు శివరామకృష్ణ, అప్పన నాగేశ్వరావు, అర్జున్, లక్ష్మీనారాయణ, బెన్నాస్వామి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులు నియంత్రించాలి

గూడెంకొత్తవీధి, జూన్ 24: గ్రామాల్లో సీజన్ వ్యాధులు నియంత్రించేందుకు కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్‌డీ పాపారావు సూచించారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. వ్యాధులు ప్రబలకుండా మంచినీటి పథకాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి క్లోరినేషన్ వేయాలన్నారు. వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తను తొలగించి బ్లీచింగ్ పిచికారీ చేయించాలన్నారు. వ్యాధులు ప్రబలిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే వైద్య సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయించి బాధితులకు సకాలంలో సేవలు అందేలా చూడాలని చెప్పారు.